www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 మే 2025
5
తిరుపతి

ప్రశాంతంగా నీట్ యుజి పరీక్షలు పూర్తి

పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న డిఆర్ఓ నర్సింహులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో ఆదివారం నీట్ యూజీ- 2025 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ సరళిని ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ మరియు పీజీ కళాశాల సెంటర్లను డిఆర్వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో మొత్తం 4445 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా అందులో 4333 మంది హాజరయ్యారని 112 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పటిష్ట బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహించామని తెలిపారు. పరీక్ష జరుగు కేంద్ర సమీపంలో ఎక్కడ కూడా జిరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.

స్వర్ణముఖి.. 'దు:ఖ ముఖి'

- ప్రక్షాళన పనులు గాలికి
- నానాటికీ దుర్గంధమయం
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :

ముక్కంటి పాదాల చెంత పవిత్ర స్వర్ణముఖి ప్రవహిస్తుండడంతో శ్రీకాళహస్తికి సద్యోముక్తి క్షేత్రం అన్న పేరు వచ్చింది. అగస్త్య మహర్షి తపస్సు ఫలితంగా స్వర్ణముఖి నది ఉద్భవించినట్లు శ్రీకాళహస్తి స్థల పురాణం చెబుతోంది. తిరుపతికి సమీపంలోని పాలకొండలో పుట్టి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వాకాడు వద్ద సముద్రంలో కలిసే స్వర్ణముఖి నది తిరుపతి జిల్లాలోనే అతిపెద్ద జల వనరు. అంతేగాక ఈ నదీ తీరంలో ముక్కోటి, తిరుచానూరు, గుడిమల్లం, శ్రీకాళహస్తి లాంటి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలు విరాజిల్లుతున్నాయి. ప్రజల తాగునీటి, సాగునీటి అవసరాలు ఈ నది తీరుస్తోంది. శ్రీకాళహస్తి దేవాలయం నిర్మాణం చేసిన కార్మికులకు వారి పనితనాన్ని బట్టి బంగారు దొరికేది. అందుకే దీనికి స్వర్ణముఖి అనే పేరు సార్థకమైంది. దీనినే మొగిలేరు అని దక్షిణ గంగ అని కూడా పిలుస్తారు. నదులకు ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పుష్కరాలు జరుగుతాయి. అయితే స్వర్ణముఖి నదికి మాత్రం ప్రతి సంవత్సరం మాఘమాసంలో పుష్కరం జరుగుతుంది. ప్రతి ఏటా పుష్కరం జరిగే నది స్వర్ణముఖి మాత్రమే. అంతటి పరమ పవిత్రమైన నది అపవిత్రంగా మారిపోతోంది.

ప్రజల అవసరాలు..నాయకుల ధన దాహం..అధికారుల నిర్లక్ష్యం వెరసి స్వర్ణముఖి దుఃఖముఖిగా మారిపోయింది. పట్టణంలోని మురుగునీటిలో సగభాగం నదిలో కలుస్తుండడంతో నది దుర్గంధ మయమయింది. ఒకప్పుడు ఈ నది నీటిని ప్రజలకు మున్సిపాలిటీ అందించేది. అయితే తెలుగు గంగ కాలువ తవ్వకం తర్వాత నదిలోని భూగర్భ జలాలను వినియోగించడం బాగా తగ్గింది. సంవత్సరంలో ఒకసారి నది నిండుగా పారితే ఏడాదిపాటు భూ గర్భంలో నీళ్లు పుష్కలంగా ఉండేవి. పట్టణంలో భవనాలు పడగొట్టినా, రోడ్లు, డివైడర్లు వెడల్పు చేసినా ఆ వ్యర్థాలన్నీ నదిలో పడేస్తున్నారు. దీంతో ఆలయానికి పక్కనే ఉన్న నది మరింత దుర్భరంగా తయారైంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు నదిలో స్నానం చేయడానికి అనుకూల వాతావరణం లేకుండా పోతోంది. దీంతో భక్తుల మనోభావాలు దెబ్బ తింటున్నాయి. పట్టణ పరిధిలోనైనా నదిని శుభ్రం చేయాలనే ఆలోచన నీటిపారుదల శాఖ అధికారులకు, దేవస్థానం అధికారులకు రావడం లేదన్న విమర్శలున్నాయి. జల హారతుల పేరుతో గత ప్రభుత్వ హయాంలో హడావుడి జరిగినా, నదిలోకి మురుగునీరు చేరుతూనే ఉంది. ఈ నదిలో లభించే ఇసుక నాణ్యమైనది కావడంతో భవనాల నిర్మాణానికి ఎక్కువగా వాడుతున్నారు. దీంతో ఇసుకకు డిమాండు ఏర్పడింది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయ కులు ఇసుకను అక్రమ రవాణా చేయడం కోట్ల రూపాయలు సంపాదించుకోవడం పరిపాటయింది. గతంలో తాగునీటికి, సాగునీటికి ఇబ్బంది లేకుండా సంతోషంగా ఉండేవారు. అయితే ఇసుక మాయమై, మురుగునీరు చేరి, వ్యర్థాలు రావడంతో నీళ్లు కలుషితం అయిపోయాయి.

ప్రక్షాళన పనులు గాలికి

గత వైసిపి ప్రభుత్వం హయాంలో స్వర్ణముఖి నది ప్రక్షాళన పేరిట తుడా నిధులు రూ. 18 కోట్లు వెచ్చించి పనులు చేపట్టారు. మొదటి దశ పనులు మాత్రం జరిగాయి. ఆ పార్టీ అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రక్షాళన పనులు అటకెక్కాయి. స్వర్ణముఖి నదిని ప్రక్షాళన చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ముఖ్య ఉద్దేశం, కానీ ఆ ఉద్దేశం మూలన పడిపోయింది. పట్టణంలో నుంచి వచ్చే మురుగునీటిని నదిలో కలవకుండా వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు పంపించి, అక్కడ శుద్ధి చేసి సాగునీరందించాలన్న ప్రతిపాదన కూడా ఉంది. ఆ మేరకు అర్ధనారీశ్వరాలయం సమీపంలో దాదాపు 12 కోట్ల వ్యయంతో ఎస్టీపీ ప్లాంట్‌ను కూడా గత ప్రభుత్వం హయాంలో నిర్మించారు. అయితే అది ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. స్వర్ణముఖి నదిలో మురుగునీటిని ఎస్ టి పి ప్లాంట్ కు చేరవేసేందుకు ఇంకా పైపులైన్లు కూడా వేయలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి స్వర్ణముఖి నది ప్రక్షాళనకు పూర్తిస్థాయిలో స్వీకారం చుట్టి నది పవిత్రతను, భక్తుల మనోభావాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వాన బీభత్సం

- ఉదయం మండుటెండ, మధ్యాహ్నం వర్షం
- చెరువులను తలపించిన రోడ్లు, కూలిన చెట్లు
- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులు
- పలుచోట్ల విద్యుత్ అంతరాయం
- పిడుగుపాటుకు ఇద్దరు మృతి

తిరుపతి భవాని నగర్, కెటి రోడ్‌లో జోరు వర్షం

తిరుపతిలో చెట్టు కొమ్మలు విరిగి కారు, ఆటోలపై పడిన దృశ్యం

ఆటో డ్రైవర్‌కు జల్లి తులసి యాదవ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రత నమోదు కాగా, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఉరుములు, మెరుపులతో గాలి వాన ప్రారంభమైంది. వర్షంతో పలురోడ్లు చెరువులను తలపించాయి. అకాల వర్షంతో వడగండ్లు అక్కడక్కడా పడ్డాయి. ఒక్కసారి వాతావరణం మారి వేసవి తాపం తగ్గడంతో నగర ప్రజలు కాస్త సేదదీరారు. గత రెండు నెలలుగా తిరుపతిలో ఎండ తీవ్రత బాగా పెరిగిపోయింది. వాతావరణం చల్లబడకపోవడంతో వృద్ధులు, చిన్న పిల్లలు తాపానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. నగరంలో పలుచోట్ల చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. గంగమ్మ గుడి సమీపంలో ఓ చెట్టు కొమ్మలు కూలి ద్విచక్ర వాహనాలపై పడ్డాయి. ఎస్వి యూనివర్సిటీ సమీపంలో గాలివానకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. అలిపిరి సమీపంలో చెట్ల కొమ్మలు రోడ్లపై పడడంతో రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధుర నగర్లో వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలకు కాసేపు అంతరాయం కలిగింది. తిరుమల బైపాస్ రోడ్డు, లక్ష్మీపురం సర్కిల్, ఎర్ర మెట్ట, శివ జ్యోతి నగర్‌లలో వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో జలమయ్యాయి. డిఆర్ మహల్ అండర్ బ్రిడ్జి, రాయల్ చెరువు అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనాదారులు ఇబ్బంది పడ్డారు. రాకపోకలు రెండు గంటలసేపు పైగా నిలిచిపోయాయి. లక్ష్మీపురం సర్కిల్ వద్ద డ్రైనేజ్ కాలువలు పొంగి ప్రవహించాయి. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వద్ద గాలి వానకు ఫుట్‌పాత్ మీద కూరగాయలు అమ్ముకునే వ్యాపారస్తులు ఇబ్బందులకు గురయ్యారు. నగరంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందింది. పలు హోర్డింగులు గాలివానకు కొట్టుకుపోయాయి. టెలిఫోన్ విద్యుత్ లైన్, కేబుల్ వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర ఈనెల ఆరో తేదీ నుంచి చాటింపు చేపట్టడంతో ముందుగానే వర్షం కురవడం పట్ల తిరుపతి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జాతర ముందు రోజు వర్షం పడటం శుభసూచకమని నగరవాసులు అంటున్నారు.

గూడూరులో కుండపోత ..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో ఆదివారం ఉరుములు , మెరుపులు, ఈదురు గాలులతో కుండ పోత వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతం అయి గంట పాటు కుండ పోత వర్షం కురిసింది. దీంతో గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాలు వర్షపునీరుతో జలమయమయ్యాయి. అదేవిధంగా గూడూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో కుండ పోత వర్షం కురిసింది.

పిడుగుపాటుకు..

మృతి చెందిన విద్యార్థి కార్తీక్

మృతి చెందిన రైతు అలం భాస్కర్

ప్రజాశక్తి - నాయుడుపేట, నాయుడుపేట రూరల్, ఓజిలి: ఆదివారం కురిసిన అధిక ఉరుములు మెరుపులతో కూడిన బీభత్సమైన అకాల వర్షం రెండు మండాలాల్లో విషాదం నింపింది. గత రెండు నెలలుగా వర్షపు చుక్క కనిపించక ఎండ తాకిడికి విలవిల్లాడిపోతున్న ప్రజలకు ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం ప్రజలకు ఎంతో ఊరటం ఇచ్చింది. అయినప్పటికీ విపరీతమైన ఈదురుగాలులతో ఉరుములు మెరుపులతో పిడుగుపాట్లతో బీభత్సం సృష్టించిన ఈ వర్షానికి ఓజిలి నాయుడుపేట మండలాల్లో ఇద్దరు ప్రాణాలను కోల్పోయారు. సూళ్లూరుపేట డివిజన్, ఓజిలి మండలం, గ్రద్దగుంట పంచాయతీ, గొల్లపాలెం వద్ద మామిడితోటలో పిడుగు పడడంతో నాయుడుపేట పట్టణంలో 7 వ తరగతి చదువుతున్న విద్యార్థి కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగ పంట పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతు ఆలం భాస్కర్‌పై పిడుగు పడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని గ్రామస్తులు తెలియజేశారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు మండలం, చెన్నూరులో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి, చెన్నూరుకు చెందిన చెన్నూరు శ్రీనివాసులు గేదె మృతి చెందింది. సుమారు దీని విలువ 40 వేల వరకు ఉంటుందని పాడి రైతు శ్రీనివాసులు తెలిపారు.

లక్ష్య సాధనకు భగీరథుడు స్ఫూర్తి

భగీరథ మహర్షి చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: లక్ష్య నిర్దేశంతో సాధన దిశగా చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని దివి నుండి భువికి గంగను తెచ్చిన భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకలకు డిఆర్ఓ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ మహనీయుల జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయాలన్న సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహా మహర్షి వేడుకలను రాష్ట్ర వేడుకగా నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోత్స్న, లక్ష్మీ నారాయణ, కలెక్టరేట్ సిబ్బంది,బి సి సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హలో యువత - చలో తిరుపతి

- ఏఐవైఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు డి.మహేష్ పిలుపు

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్: తిరుపతిలో జరగబోయే 17వ ఏఐవైఎఫ్ జాతీయ మహసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు డి.మహేష్ కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ వద్ద వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి, యువకులు తిరుపతికి తరలివచ్చి జరగబోయే అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలకు సంబందించిన పోస్టర్లను పుత్తూరు మండల అధ్యక్షులు దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 15 నుంచీ 18 వరకు తిరుపతిలో మొట్ట మొదటి సారిగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మహాసభలు జరగబోతున్నాయన్నారు. ఈ మహా సభలు చాలా ప్రాధాన్యతతో కూడుకున్నవని, దేశంలోని మొత్తం 29 రాష్ట్రాల నుండి యువజన సమాఖ్య ప్రతినిధులు వస్తున్నారని, వేలాది మంది, యువతి, యువకులు భారీ ర్యాలీలో కదం తొక్కబోతున్నారని, సుమారు వెయ్యి మంది ప్రతినిధులతో సభ మూడు రోజుల పాటు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. దేశంలో పేరుకుపోతున్న నిరుద్యోగం, అశాంతి, ప్రాంతీయ, మత తత్వ విధానాలు, జాతీయ విద్యా విధానం, ఉపాధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, భవిషత్ కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు.

యువతను నిర్వీర్యం చేస్తున్న మద్యం, గంజాయి, డ్రగ్స్, ఇతర అసాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసిందని దేశాన్ని క్యాన్సర్ల పట్టిపీడిస్తున్న అవినీతి లంచ గొండి తనాన్ని రూపుమాపడానికి, అవినీతి అంతం, ఏఐవైఎఫ్ పంతంగాబీ శపథం చేసి పోరాటాలను కొనసాగిస్తున్నదని, విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు భార్గవ్, వినోద్, పొన్ను స్వామి ,మనోజ్, ప్రదీప్, రఘు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధం వద్దే వద్దు!

ఉగ్రవాదులపై పోరు మానవాళికి మేలు : రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల సూచన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశ పరిణామాలు పరిశీలిస్తే పాక్, భారత్‌ల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నట్లు స్పష్టమవుతోంది. యుద్ధం వల్ల ప్రాణ నష్టం, ఆస్తుల నష్టంతోపాటు అభివృద్ధి శూన్యమవడం తప్ప సాధించేది ఏమీ ఉండదని చరిత్ర బట్టి తెలుస్తోంది. కాబట్టి పాకిస్తాన్‌పై కాక, ఉగ్రవాదంపై యుద్ధం ప్రకటించాలి. ఉగ్రవాదం తుద ముట్టడించడానికి మన దేశ శక్తి సామర్థ్యాలను కూడగట్టుకుని ముందుకు సాగాలి. దేశ ప్రధాని నరేంద్ర మోడీ యుద్ధానికి సిద్ధమవుతూ యుద్ధ విమానాలను సిద్ధం చేయడమే కాక, సైన్యాన్ని మన దేశ సరిహద్దులకు తరలించడం సరికాదని తిరుపతిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయ పడ్డారు.

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి అంబేద్కర్ భవన్‌లో కన్వీనర్ పి.అంజయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాస నాగరాజులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యుద్ధం పేరుతో దేశ సమగ్రత, సౌభ్రాతృత్వం దెబ్బతింటుందన్నారు. మన దేశం లౌకిక భారతదేశం ఇక్కడ అన్ని కులాలు, మతాలు వారి వారి విశ్వాసాల ప్రకారం జీవించడానికి మన రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కల్పించడమే పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించడమని అభిప్రాయం వ్యక్తం చేశారు. మన పాలకులు అధికారాన్ని కాపాడుకోవడానికి మైనార్టీలను బూచిగా చూపెట్టి ముస్లిమ్స్‌లపై కొన్ని ప్రేరేపిత సంస్థలు పనిగట్టుకుని భారతీయ ముస్లిం సోదరులపై విషం కక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ప్రజలు కానీ, భారత్ ప్రజలు కానీ యుద్ధం కోరుకోవడం లేదని, మోడీ ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. యుద్ధంతో ఉక్రెయిన్, రష్యా దేశాలు వేలాదిమంది సిపాయిలను, ప్రజలను, ప్రజల ఆస్తులను నష్టం చేసుకుని వందేళ్లు వెనక్కి వెళ్ళాయనేది స్పష్టంగా మనకు అర్థమవుతోందన్నారు. కేంద్రంలో కొనసాగుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని నారాయణ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఏ.సుబ్రహ్మణ్యం, సిపిఐ (యం.ఎల్) న్యూ డెమోక్రసీ సీనియర్ నాయకులు పాటూరు వెంకటరత్నం, ఇఫ్టూ పట్టణ నాయకులు లోకేశ్వర్ రెడ్డి, కవి,రచయిత గొడుగు చింత గోవిందయ్య, ముస్లిం మత పెద్దలు అహ్మద్ షఫీ ఖాద్రీ, మాలిక్, నూరుల్లా భాష, అమీర్ భాష, సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఆమూరి సుధాకర్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ఏ.రామానాయుడు తదితరలు పాల్గొన్నారు.

తవ్వి పడేస్తున్నారు

- పైపులైన్ల తవ్వకాలతో తిప్పలు
- వాహన చోదకులకు దుమ్ము, ధూళితో ఇబ్బంది

ప్రజాశక్తి -వరదయ్యపాలెం : అటు గ్యాస్ పైప్ లైన్లు ఇటు వాటర్ పైప్లైన్లకోసం ఇష్టా రాజ్యాంగా జరుగుతున్న తవ్వకాలతో సత్యవేడు, కడూరు కూడలి, శ్రీకాళహస్తి, తడ ఆర్ అండ్ బి రోడ్లు దెబ్బతింటున్నాయి. దీనికి తోడు పలుచోట్ల పైప్లైన్ కోసం తవ్వకాలు చేసి మట్టి కుప్పలను అలాగే వదిలేయడంతో వాహనం వెళ్లనప్పుడు పెద్ద ఎత్తున దుమ్ము లేస్తోంది. దీంతో స్థానికులు దుమ్ము పిలిచి అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు. అసలే వేసవి ప్రారంభం కావడంతో రోడ్లపై మట్టి లేస్తుందని, వాహనాలు వెళ్ళే సమయంలో మరింత దుమ్ము, ధూళి లేస్తూ ఉండడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వాహనం వెళ్లే సమయంలో వెనుక వెళ్లే ద్విచక్ర వాహనదారులకు దుమ్ము కమ్మి కళ్ళు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు కనీసం మట్టి కుప్పులు ఉన్న ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లితే దుమ్ము పైకి లేవకుండా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా వరదయ్యపాలెం, యానాది వెట్టు కంచరపాలెం, సుబ్బరాజు కండ్రిగ, శ్రీకాళహస్తి, తడ మార్గాలలో నెలవాయి, వేణుగోపాలపురం, తలారి పెట్టు, ఎన్టీఆర్ నగర్, ఇందిరానగర్ వరదయ్యపాలెం దళితవాడ ప్రాంతాల్లో దుమ్ము విపరీతంగా రేగుతోంది. దీనిపై ఆర్ అండ్ బి ఉన్నత అధికారులు స్పందించి స్థానికులకు, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని, అలాగే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బంది

గత కొన్ని రోజులుగా గ్యాస్ పైప్ లైన్ కోసం రోడ్డు ఇరువైపులా తవ్వుతున్న క్రమంలో వాహనదారుల తాకిడి ఎక్కువగా ఉన్న సమయంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్రీ సిటీ పరిశ్రమలకు సంబంధించిన వాహనాలు వచ్చే సమయంలో గంటలకొద్దీ వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కాంట్రాక్టర్ ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలం కావడంతో ఇటువంటి సమస్య అనేకమార్లు తలెత్తుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పచ్చని చెట్లను నరికేస్తున్నారు

దాదాపు 12 సంవత్సరాల క్రితం ఉపాధి హామీ పథకంలో భాగంగా కొన్ని వందల చెట్లను ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రోడ్డు ఇరువైపులా నాటడం జరిగింది. గ్యాస్ పైపులు, వాటర్ పైపులు వేసే క్రమంలో పచ్చగా తోరణంలా ఉండే చెట్లను కూలగొడుతున్నారు. దాదాపు వందల సంఖ్యలో చెట్లను కూల్చివేయడంతో రానున్న కాలంలో ఈ ప్రాంతం తీవ్ర కాలుష్యం కోరల్లో చిక్కుకోనుందని నిపుణులు తెలుపుతున్నారు.

చిన్నపిల్లల్లో శ్వాస సంబంధిత సమస్యలు

దాదాపు మూడు నెలలగా రోడ్డుపై లేస్తున్న దుమ్ము కారణంగా చిన్నపిల్లల్లో శ్వాస సంబంధిత ఇబ్బందులు వస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా సురక్షిత మార్గంలో తవ్వకాలు జరపాలని కోరుతున్నారు.

బస్ షెల్టర్ లేక.. ఎండకు తాళలేక..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జంట పట్టణాలైన పుత్తూరు, నగరి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కనీసం బస్సు షెల్టర్లు లేకపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. పుత్తూరు, నగరి పట్టణాలకు పరిసర ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ప్రధాన కూడళ్లలోనే బస్సులు ఎక్కుతారు. పుత్తూరు ఆర్టీసీ డిపోలో కంటే, రహదారి పక్కన నిలబడి బస్సులు ఎక్కేవారే ఎక్కువ. ప్రస్తుతం మండుతున్న ఎండలకు బస్సుల కోసం ప్రధాన కూడళ్లలో నిల్చోలేని పరిస్థితి ఏర్పడింది. పుత్తూరు జనాభా 60వేలు. నగరి పట్టణ జనాభా 65 వేలు. పుత్తూరు పట్టణ పరిధిలో విద్యాసంస్థలు ఉండటంతో నిత్యం 10 వేల మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎండ వచ్చినా, వాన వచ్చినా ఏ దుకాణం ముందో, చెట్ల కిందనో నిలబడాల్సిందే తప్ప.. నిలువ నీడలేదు. పుత్తూరులోని కార్వేటినగరం రోడ్డులో ఓ షెల్టర్ ఉన్నా అది నిరుపయోగంగా మారింది. ఇక్కడ ద్విచక్ర వాహనాలు నిలుపుతుంటారు. దీంతో ప్రయాణికులు ఎండలోనే నిల్చోవాల్సి వస్తోంది. ఎండ తీవ్రత, ఉక్కపోతతో జనం బెంబేలెత్తుతున్నారు. పుత్తూరు పట్టణంలో కార్వేటినగరం రోడ్డు, తిరుపతి-అరక్కోణం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇరువైపులా, ఆర్డీఎం రైల్వే గేటు వద్ద ఇరువైపులా షెల్టర్లు లేవు. నగరిలోని టవర్ క్లాక్ వద్ద ఇదే పరిస్థితి. కార్వేటినగరం రోడ్డులో నీడకోసం అక్కడ ఉన్న ఓ పెద్ద రావిచెట్టే దిక్కు. వర్షం వస్తే అక్కడా నిలబడ లేని పరిస్థితి. శల్య వైద్యానికి వివిధ ప్రాంతాల నుంచి పుత్తూరుకు వచ్చే వారు పున్నమి వద్ద బస్సులు దిగి ఆటోలో రాచపాళెం చేరుకుని అక్కడ కట్లు కట్టించుకున్న అనంతరం పున్నమి వద్దకు వచ్చి తమిళనాడు వెళ్తారు. ఇక్కడ తలదాచుకోవడానికి షెల్టర్ లేక వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ వేసవిలో వేచి ఉండటానికి మున్సిపల్ అధికారులు చలువ పందిళ్లయినా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేసవి తీవ్రతతో ఇక్కట్లు

పుత్తూరు పట్టణ ప్రధాన కోడలిలో, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, ఆర్డియన్ థియేటర్ వద్ద, కార్వేటి నగర్ రోడ్డు, అంబేద్కర్ సర్కిళ్లలో బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. విద్యార్థులు, ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో వేచి ఉండాల్సి వస్తోంది. ఆ ప్రాంతాలలో నిలువ నీడ లేక బస్సుల కోసం వేచి చూసేవారి అవస్థ వర్ణనాతీతం. ఒక వైపు ఎండ వేడిమి, మరోవైపు ఉక్క పోత, అధికారులు స్పందించి షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

- ఆర్.వెంకటేష్, సిపిఎం జిల్లా నాయకులు

రెవెన్యూ శాఖ వారు సర్వే చేసి స్థలం కేటాయిస్తే.. బస్సు షెల్టర్లు నిర్మిస్తాం

పుత్తూరు నగర పరిధిలో బస్సు షెల్టర్ల ఏర్పాటుకు రెవెన్యూ శాఖ వారు సర్వే చేసి స్థలం ఏర్పాటు చేస్తే, మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మంజూరు చేసి షెల్టర్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- మంజునాథ గౌడ్, మున్సిపల్ కమిషనర్

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

కమిషనర్ ఎన్.మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో సోమవారం నుండి ఏర్పాటు చేయనున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దుకోవడం కోసం, కొత్త ఆధార్ నమోదు ఈరోజు నుండి 8వ తేదీ వరకు, అలాగే 12 నుండి 15 వ తేదీ వరకు వెస్సుండ సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. దొడ్డాపురం వీధి-01, ఐ.ఎస్ మహల్ రోడ్-02, జర్నలిస్ట్‌కాలనీ-01, కెనడీ నగర్-01, మధురానగర్-1,2, పోస్టల్ కాలనీ-04, ప్రకాశంరోడ్-02, రాజీవ్ నగర్ జీకేకేకాలనీ-06, శంకర్ కాలనీ-01, రేణిగుంట రోడ్-1, రాజీవ్ నగర్ జీకేకే-03, వెన్నారెడ్డి కాలనీ -03 నందు ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు : ఈరోజు నుండి 8వ తేదీ వరకు, నాలుగు రోజులపాటు జరిగే ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. చిన్న పిల్లలకు ఎవరైనా ఆధార్ చేయకుంటే, ఈ క్యాంపులలో ఆధార్ చేసుకొనే అవకాశం ఉండని అన్నారు. చిట్టిచర్ల, రంగన్నగారిగడ్డ గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నీరు వృథా.. తప్పదు వ్యథ

బాలాయపల్లి - ప్రజాశక్తి : బాలాయపల్లి మండలం, జయంపు గ్రామంలో కొందరు స్వార్థపరులు చెరువు తూములు ఎత్తేసి నీటిని సొంత అవసరాలకోసం వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చాలా నీరు వృథామయిపోతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండాకాలం, తాగు నీటికి కూడా చెరువు నీటిపై ఆధార పడ్డ గ్రామస్తులు నీటి వృథాను పంచాయతీ అధికారులు అడ్డుకోవాలని కోరుతున్నారు. చెరువులో నీరు నిల్వ ఉన్నందున భూమిలో నీటి శాతం పెరిగి గ్రామంలో ఉన్న బోర్లలో, బావుల్లో నీరు పుష్కలంగా ఉంది. కానీ ఈ విధంగా తమ స్వార్థంకోసం చెరువు నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో నీటికి కటకట తప్పదని గ్రామస్తులు తెలుపుతున్నారు. జంతువులకు, పక్షులకు కూడా దప్పిక తీర్చుకొనుటకు ఎంతో అవసరముగా ఉన్న చెరువు నీటి వృథాని అడ్డుకోవాలని కోరుకున్నారు. ఆ చెరువు ప్రాంతంలో పని చేయు ఉపాధి హామీ కూలీలకు కూడా ఆ చెరువు నీరు దప్పిక తీరుస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు తూముల మూయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష

పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డిఆర్‌డబ్ల్యూ మహిళ కళాశాలలో ఆదివారం నీట్ పరీక్ష నిర్వహించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాల్‌కి అనుమతించారు. పరీక్షకు 409 మందికి గాను 398 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. గూడూరు డిఎస్పీ గీతా కుమారి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్ సర్వీసుకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గృహ విద్యుత్ వినియోగదారులకు తమ విద్యుత్ సర్వీసులకు ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ తిరుపతి టౌన్ డివిజన్ చంద్రశేఖర రావు ఒక ప్రకటన తెలిపారు. వినియోగదారులు నాలుగు రోజులలోపు తమ సర్వీసులను ఆధార్ సీడింగ్ చేసుకొని విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - నాగలాపురం: పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర రావు మెమోరియల్ ట్రస్ట్ వారు తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీ శంకర్, సీతాకు, సీతారామ నాయుడు పర్యవేక్షణలో నాగలాపురం సాయిబాబా మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 180 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అందులో 60 మందికి మందులు, 40 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 70 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏఒ కృష్ణ, అరవింద నేత్రాలయ సిబ్బంది గౌరీ శంకర్ పాల్గొన్నారు, సాయిబాబా ఆలయ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డాక్టర్ ఆర్.కె రెడ్డికి ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆబాకస్‌లో అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డును తిరుపతిలోని ఆర్.కె ఆబాకస్ సంస్థ అధినేత డాక్టర్ టి.రామ కృష్ణారెడ్డి ఆదివారం అందుకున్నారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ లో ఎ.ఎ (ట్రిపుల్ ఎ)ఆబాకస్ వారి ఆధ్వర్యంలో అంగన్యూస్ అర్థమేటిక్స్‌పై శిక్షణ అనంతరం 20వ ఆబాకస్ ఇంటర్నేషనల్ ఆబాకస్ కాంపిటీషన్స్ నిర్వహణకు ట్రిపుల్ ఎ ఇన్నిట్యూషన్స్ ఫౌండర్ గంగాధర్‌కు ఆహ్వానించడం జరిగింది ఆబాకస్ సంస్థ డైరెక్టర్ ఆర్. కె విమల తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర్‌తో పాటు తిరుపతి ఆర్.కె ఆబాకస్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ ఉసాగురు రెడ్డెప్ప, ఆర్. కె ఆబాకస్ సభ్యులు అశోక్ రెడ్డి, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆందోళన కరంగా ఉపాధ్యాయుల వివాదాలు

ఎంఈఓ మునిరత్నంకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - నాయుడుపేట:ఈమధ్య తిరుపతి జిల్లా నాయుడుపేటలో ఉపాధ్యాయుల వివాదాలు రోజురోజుకి పెరిగిపోతూ విద్యార్థుల తల్లిదండ్రులలో ఆందోళన కలిగిస్తు న్నాయి పాఠశాలల్లోని ఉపాధ్యా యులు వారి వారి సంఘాల తరపు ఎదుటివారిని ఎదుర్కొనేందుకు తప్పు దోవలు తొక్కుతూ ఒకరినొకరు కవ్వించు కుంటు ఉపాధ్యాయ వృత్తికి కలంకాలు తీసుకొస్తున్నారని నాయుడుపేట ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.వివరాల్లోకెళితే నాయుడుపేట జడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న ఏపీటీఎఫ్ 257 యూనియన్ ఉపాధ్యాయులు, అదే పాఠశాలలో పనిచేస్తున్న యుటిఎఫ్ ఉపాధ్యాయులపై నాయుడుపేట ఎంఈఓ కు ఫిర్యాదు చేయడంపై, యుటిఎఫ్ యూనియన్ ఉపాధ్యాయులు ఏపీటీఎఫ్ 257 ఉపాధ్యాయులు తమపై తప్పుడు ఫిర్యాదు చేశారంటూ మే 3వ తేదీ శనివారం అదే ఎంఈఓ కు వినతిపత్రం అందజేశారు.ఈ వివాదాలపై యుటిఎఫ్ నాయకులు మండల అధ్యక్ష కార్యదర్శులు అయిన కే సుబ్బారావు, టి గోవర్ధన్ రెడ్డి వివరాలు తెలియజేశారు. యుటిఎఫ్ నాయకత్వాన్ని ఎదుర్కోలేక సాటి ఉపాధ్యాయులైనా ఏపీటీఎఫ్ 257 యూనియన్ నాయకులు విలువలు మరిచి మాపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని నాయుడుపేట చెందిన యూటీఎఫ్ నాయకులు అన్నారు. ఉపాధ్యాయులయుండి విద్యావ్యవస్థలో పూర్తి అవగాహన లేక నాయుడుపేట జడ్పీ హైస్కూల్లోని హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం నాయుడుపేట ఎమ్ ఈ ఓ మునిరత్నం కు వినతిపత్రం ఇవ్వటంపై యూటీఫ్ నాయకులు స్పందించారు.మన రాష్ట్రంలో ప్రస్తుతం 294 హై స్కూల్ ప్లస్ (జూనియర్ బాలికల కళాశాలలు) విజయవంతంగా కొనసాగుతున్నాయని.ఇందులో పీజీ అర్హత కలిగిన 1752 మంది పీజీటీ ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారు. అనేక పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ, అదే పాఠశాలలో హై స్కూల్ ప్లస్ విభాగంలో పీజీటీ లుగా చేరిన ఉపాధ్యాయులు చాలా మంది ఉన్నారు. మే 2025లో జరగనున్న బదిలీల దృష్ట్యా, హై స్కూల్ ప్లస్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియలో హై స్కూల్ ప్లస్ లలో పీజీటీ గా చేరిన ఉపాధ్యాయులకు వారు పీజీటీ లుగా చేరిన తేదీలు మాత్రమే టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిఆర్ఎస్)లో నమోదు చేయబడ్డాయి. ఎవరూ ఉద్దేశపూర్వకంగా తేదీలను మార్చటం కానీ మార్చే అవకాశం కానీ లేదు అయితే నాయుడుపేట మండలంలోని జడ్పీ హై స్కూల్ ప్లస్‌లో విధులు నిర్వహిస్తున్న కె.సుబ్బారావుపై ఏపీటీఎఫ్ 257 నాయుడుపేట మండల శాఖ కావాలనే కక్షతో, అసత్య ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేయడం జరిగింది. ఇది వారి వ్యక్తిగత కక్షకు నిదర్శనం. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా ఉన్న ఉపాధ్యాయుల వివరాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా చేరిన తేదీలు కాక, కేవలం హై స్కూల్ ప్లస్ పీజీటీ గా చేరిన తేదీలే నమోదయ్యాయి. బదిలీలకు సంబంధించిన గైడ్లైన్స్ కూడా ఇంకా విడుదల కాలేదు. అయినప్పటికీ, వ్యక్తిగత కక్షతో యుటిఎఫ్ ఉపాధ్యాయులపై నిరాధార ఆరోపణలు చేయడం ఏపీటిఎఫ్ అవివేకానికి అద్దం పడుతుందని ఎద్దేవచేశారు. సూళ్ళూరుపేట నియోజక వర్గంలో ఉన్న మూడు హైస్కూల్ ప్లస్ స్కూళ్లలో ఇదే విధానం కొనసాగుతుందని సూళ్లూరుపేటలో గల జడ్పీ గర్ల్స్ హై స్కూల్ ప్లస్‌లో పిజిటిగా పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయిని కూడా పాఠశాలలో చేరిన తేదీ, పిజిటి గా చేరిన తేదీనే టీఐఎస్‌లో నమోదై ఉంది.ఆమె కూడా ఏపీటీఎఫ్ 257 మీ సభ్యురాలేనని అలాంటప్పుడు కే.సుబ్బారావు పై ఫిర్యాదు చేసిన సందర్భంలో , ఏపీటీఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు వారి సంఘ ప్రధాన బాధ్యులకు ఈ విషయంపై అవగాహన లేదా లేక వారు వ్యక్తిగత కక్షతోనే ఈ ఫిర్యాదు ఇవ్వటం జరిగిందో బదిలివ్వాలంటూ మండిపడ్డారు. గత బదిలీల్లో స్పౌజ్ కేటగిరీలో తప్పుడు సమాచారం ఇచ్చి లబ్ధి పొందిన చరిత్ర ఏపీటీఎఫ్ 257 సభ్యులదని గుర్తు చేశారు. ఏపీటీఎఫ్ 257 నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సిగ్గుచేటని బాధ్యత గల ఉపాధ్యాయులయుండి ఇలా తప్పు దోవలకు పాల్పడుతూ గౌరవపదమైన ఉపాధ్యాయుల వృత్తికి కళంకం తీసుకురావద్దని హితవుపలికారు.ఏపీటీఎఫ్ 257 నాయకుల్లా మనిషికో న్యాయం అన్న విధానం మాలో లేదని ప్రభుత్వం విధించిన గైడ్‌లైన్స్ ప్రకారమే యుటిఎఫ్‌కు చెందిన ఉపాధ్యాయులు విధుల్లో కొనసాగుతున్నారని స్పష్టంచేశారు. బాధ్యత గల ఉపాధ్యాయులయుండి ఇలాంటి అర్థం పర్థం లేని గొడవలకు పాల్పడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేయబడ్డ దేవాలయాల వంటి పాఠశాలల గౌరవాన్ని తగ్గించేలా ప్రవర్తిస్తూ విద్యార్థుల భవిష్యత్తుని నాశనం చేయొద్దని ఇది ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలలపై కళాశాలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లి విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని నాయుడుపేట ప్రజలుఆ పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతిలో లెర్నింగ్ సెంటర్ ప్రారంభించిన వేదాంతు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తన సొంత ప్రాంతం తిరుపతిలో లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా రాబోయే రోజుల్లో ఎక్కువ మంది విద్యార్థులకు అందుబాటులో ఉండాలనే విజన్‌తో వేదాంతు లెర్నింగ్ సెంటర్ ప్రారంభించినట్లు ఆ సంస్థ సీఈవో వంశీ కృష్ణ తెలిపారు. తిరుపతి న్యూ మారుతి నగర్‌లో నూతన లెర్నింగ్ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఆదివారం కచ్చపి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పూర్తి సామర్థ్యాన్ని బయటకు తీసుకువచ్చేది ఉపాధ్యాయుడే. అలాంటి ఉపాధ్యాయుడు అందించే బోధన అద్భుతంగా ఉండాలని బలంగా నమ్ముతోంది వేదాంతు. అందుకే అదే లక్ష్యంతో అభ్యాస నమూనా అత్యాధునిక సాంకేతికత, డేటా-ఆధారిత బోధన, వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వాన్ని మిళితం చేసి, ప్రభావవంతమైన అభ్యాస అనుభవాలను అందిస్తుంది. భారతదేశం అంతటా 100% ఆఫ్‌లైన్ కేంద్రాల వేగంగా విస్తరిస్తున్న నెట్‌వర్క్ తో, జెఈఈ, నీట్, స్టేట్ బోర్డ్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు వ్యక్తిగతీకరించిన విద్య కోసం వేదాంతు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తోందన్నారు. ఈ సరికొత్త లెర్నింగ్ సెంటర్ ప్రారంభం ద్వారా ఇదే పట్టణం తిరుపతిలో జన్మించిన వేదాంతు సహ వ్యవస్థాపకుడు అయినా తనకు ఇది ఎంతో విశిష్టమైనది. స్థానిక తరగతి గదుల నుండి ఐఐటీ బాంబే వరకు, ఆ తర్వాత భారతదేశంలో అత్యంత గౌరవనీయమైన విద్యా సంస్థలలో ఒకదానిని నిర్మించడం వరకు నా ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తి దాయకం. అన్నింటికి మించి విద్య పవర్‌ని ఇది తెలియచేస్తుంది. తిరుపతికి తిరిగి రావడంతో నా జీవితం మళ్లీ పూర్తి వృత్తంలోకి వచ్చినట్లు అనిపిస్తుంది" అని అన్నారు. "ఇక్కడే నా ప్రయాణం ప్రారంభమైంది, ఇవాళ, విద్యార్థులలో సామర్థ్యాన్ని అన్‌లాక్ చేయడానికి, రూపొందించిన నమూనాను తిరిగి తీసుకురావడానికి నేను గర్వపడుతున్నాను. మా అభ్యాస కేంద్రాలు తరగతి గదుల కంటే ఎక్కువ - అవి కలల కోసం లాంచ్‌ప్యాడ్‌లు." అని అన్నారు. గత 18 నెలల్లో, వేదాంతు ఆఫ్‌లైన్ ద్వారా హైదరాబాద్, చెన్నై, విజయవాడ, పాట్నా, కోయంబత్తూర్ ఇప్పుడు తిరుపతితో సహా 35 కి పైగా నగరాలకు విస్తరించింది. ప్రతి కొత్త కేంద్రం వేదాంతు విద్యను ప్రజాస్వామ్యీకరించాలనే దార్శనికతకు దగ్గరగా తీసుకువస్తుంది - దేశవ్యాప్తంగా విద్యార్థులు ఉత్తమ ఉపాధ్యాయులను, అత్యంత వ్యక్తిగతీకరించిన అభ్యాస పద్ధతులను పొందగలరని నిర్ధారిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాజమాన్య భద్రత లోపమే

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - సత్యవేడు: స్ప్రే కంపెనీ యాజమాన్య భద్రత లోపం కారణంగానే కార్మికుడు మృతి చెందాడని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్ అనుమానం వ్యక్తం చేశారు. మండలంలోని పాలగుంట గ్రామంలో ఉన్న స్ప్రే కంపెనీలో శనివారం బాయిలర్‌లో పడి ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుడు ఫారన్(22) మృతి చెందిన నేపథ్యంలో, ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద కార్మిక నాయకులు మెలుగు రమేష్ మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుని మృతి చాలా బాధాకరమన్నారు. కంపెనీ యాజమాన్యం ఎలాంటి భద్రత చర్యలు చేపట్టకుండా కార్మికుడు ఫారన్‌ను కాలుతున్న బాయిలర్‌పైకి ఎక్కించి వెల్డింగ్ చేయించడం దుర్మార్గమన్నారు. కార్మికుడి మృతికి స్ప్రే కంపెనీ యాజమాన్యం పూర్తి బాధ్యత వహించి కార్మికుడు ఫారన్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులపై నిర్లక్ష్యం వీడి ఇలాంటి ప్రమాదాలు పునరావృత్తం కాకుండా కంపెనీ యాజమాన్యం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వం కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుని న్యాయం చేయాలని లేకుంటే బాధితుల పక్షాన నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. మృతి చెందిన ఫారన్‌కు సిఐటియు నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

దివ్యాంగులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కొనియాడారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన 160వ నెల సేవా కార్యక్రమానికి ఆదివారం బొజ్జల కుటుంబం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే అందజేశారు. హెల్పింగ్ హాండ్స్ సంస్థ నిర్వాహకుడు మునీర్ బాషాను ఆదర్శంగా తీసుకొని మరింత మంది దాతలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు తన వంతు సాయంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితా రెడ్డి, టిడిపి పట్ల అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో చిన్న రాజప్ప



చిన్నరాజప్పకు శివయ్య చిత్రపటం అందిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మాజీమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే చిన్న రాజప్ప ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఏర్పేడు మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ నైనారు పొన్నారావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికారు. టీడీపీ నేతలు పొన్నారావు, ప్రకాష్ నాయుడు, నైనారు బాలాజీ ముక్కంటి తీర్థ ప్రసాదాలు జ్ఞాపికలు అందజేశారు.

7న నారాలోకేష్ సత్యవేడుకు రాక

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - సత్యవేడు: మంత్రి నారాలోకేష్ ఈనెల7వ తేది సత్యవేడు నియోజకవర్గ కేంద్రానికి రానున్నారు. సత్యవేడు నియోజకవర్గంపై వస్తున్న రాజకీయ ఆరోపణలు, ఇన్‌చార్జ్‌ను నియమించాలని పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వస్తున్న అభ్యర్థనలను, విశ్లేషించి, ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తతో ముఖముఖి భేటితో అభిప్రాయ సేకరణ కూడా మంత్రి లోకేష్ చేపట్టనున్నట్లు, విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో సమావేశ సభ, కార్యక్రమ ప్రణాళికకు అనుగుణంగా ఏర్పాట్లును శాప్ చెర్మైన్ రవినాయుడు, నియోజకవర్గ కోఆర్డి నేటర్ శ్రీపతి బాబు, పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు పరిశీలిస్తున్నారు.

రైతు కూలీ బిడ్డకు నవోదయలో ప్రవేశం

డోల ప్రసాద్

ప్రజాశక్తి - రామచంద్రాపురం:రామచంద్రాపురం మండలం, మెత్త కుప్పం పంచాయతీ, పాలమాకులపల్లిలో నివాసముంటున్న రైతు కూలీ ఇంట పుట్టిన డోల ప్రసాద్ నవోదయ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందాడు. ఈ సందర్భంగా డోల ప్రసాద్‌ని పలువురు అభినందించారు. 2025-26 విద్యా సంవత్సరంలో మదనపల్లి సమీపంలోని వలస పల్లె నవోదయ పాఠశాలలో ఆరో తరగతి నందు ప్రవేశం పొందాడు.

ధర్నాలను జయప్రదం చేయండి

వడ్డీపల్లి చెంగయ్య

ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 5,6,7, తేదీలలో మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు ఈనెల 8వ తేదీ మున్సిపల్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలు నిర్వహిచనున్నారు. ఈ నిరసన కార్యక్రమాల్ని తిరుపతి జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో జయప్రదం చేయాలని, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య ఒక ప్రకటనలో కోరారు.

క్రైం న్యూస్

26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి మామూడూరు నార్త్ బీట్‌లో ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతోందని అందిన రహస్య సమాచారం మేరకు, ఆదివారం తెల్లవారుజామున అటవీ శాఖ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీలను గుర్తించిన స్మగ్లర్లు అతివేగంగా వాహనాన్ని నడిపి అటవీశాఖ అధికారులను తప్పించుకొని పరిపోవడానికి ప్రయత్నించగా వారిని వెంబడించడంతో స్మగ్లర్లు వాహనాన్ని విడిచి వెళ్లిపోయారని తిరుపతి రేంజి ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. తిరుపతి-కడప మార్గంలోని ఆంజనేయపురం చెక్ పోస్ట్ వద్ద వానాన్ని విడిచి వెళ్లిపోవడంతో వాహనాన్ని పరిశీలించగా అందులో 26 ఎర్రచందనం దుంగలు గుర్తించామన్నారు. వీటి బరువు 332 కేజీలు ఉన్నాయని, పారిపోయిన స్మగ్లర్ల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టమన్నారు. ఈ దాడులలో మామునూరు సెక్షన్ డిఆర్‌ఓ గౌస్ కరీం, ఎఫ్బిఓలు శరవణ కుమార్, జాన్ శ్యాముల్ బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి



బట్టా చంద్రయ్య (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల పరిధిలోని పోలిరెడ్డి పాలెం గ్రామ సమీపాన ఉన్న రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం రైల్వే ట్రాక్ పట్టాలు దాటుతున్న వృద్ధుడు బట్టా చంద్రయ్య (65) రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. జిఆర్పి పోలీసుల కథనం మేరకు, మావిళ్ళపాడు గ్రామానికి చెందిన చంద్రయ్య, పొలం పనులు చూసుకునేందుకు రైలు పట్టాలను దాటుతున్న సమయంలో చెన్నై వైపు నుండి నెల్లూరు వైపు వెళ్లే రైలు ఢీకొనింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును జిఆర్పి ఎస్సై చెన్నకేశవ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టుగా తెలిపారు.

ఆస్తి తగాదాల్లో మూకుమ్మడిగా దాడి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీవరం లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం, సీతారాంపేట దళితవాడలో శ్రీవరం లక్ష్మీనారాయణ అనే వ్యక్తిపై సమీప బంధువులు మూకుమ్మడిగా దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం చిట్టేటి హర్షవర్ధన్, పోతురాజు మనోహర్, పోతురాజు రమేష్, ఓజిలి సుధాకర్, అను నలుగురు వ్యక్తులు కలిసి ఆస్తి భాగ పరిష్కారాల విషయమై తన స్వగ్రామమైన సీతారాంపేట దళితవాడలోని ఇంటికి పిలిపించి హత్యాయత్నానికి పాల్పడ్డారని బాధితుడు వాపోయాడు. పోలీసులు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు. బాధితుడు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.

దోపిడీ కేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 2 లక్షలు రూపాయలు, ఒక రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు పుత్తూరు సిఐ సురేంద్ర నాయుడు, ఎస్సై ఓబయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులు సమావేశంలో సిఐ వివరాలను వెల్లడించారు. పుత్తూరు నేతాజీ స్ట్రీట్‌కి చెందిన ఆర్.మహేంద్ర, పుత్తూరు టౌన్ ఎన్టీఆర్ కాలనీ ఈశ్వరి కళ్యాణ మండపం పక్కన మీనాక్షి ఏజెన్సీ పాన్ మసాలా హోల్‌సేల్ గోడౌన్ నడుపుతున్నాడు. పిచ్చాటూరుకు చెందిన మునికృష్ణ, మహేంద్ర వద్ద గుట్కా, హాన్స్ ప్యాకెట్లు కొనేవాడు. నెలకోసారి మునికృష్ణ కొడుకు ఠాగూర్ గోడౌన్ వద్దకు వచ్చి నాలుగు నుండి ఐదు లక్షల వరకు సరుకుకొని డబ్బులు కట్టి వెళ్లేవాడు. ఠాగూర్ తన గ్రామానికి చెందిన పాండియన్, మోటర్ సైకిల్ మెకానిక్ రసూల్ ద్వారా పరిచయమైన గుమ్మిడి పూడికి చెందిన దినేష్‌లతో కలిసి మద్యానికి, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి జల్సాలకు డబ్బులు అవసరమై తెలిసిన వారి వద్ద అప్పులు చేసేవారు. అప్పులు కట్టలేక మహేంద్ర వద్దనుండి నగదు చోరీ చేయాలని ఠాగూర్, దినేష్, పాండియన్‌లు పథకం వేశారు. ఏప్రిల్ 19వ తేదీ ఉదయం ఠాగూర్ తన మామతో కలిసి మహేంద్ర గోడౌన్‌కు వెళ్లి 4,30,000 రూపాయలు కట్టి ఠాగూర్ సరుకు తీసుకొని వెళ్లాడు. తర్వాత గోడౌన్ బయటకు వచ్చి పాండియనుకు ఫోన్ చేసి డబ్బులు కట్టేశాను ఇంక లోపలికి రమ్మని చెప్పాడు. మహేంద్రను కత్తి చూపించి గల్లాలో ఉన్న డబ్బులు మొత్తం ఇమ్మని బెదిరించి, అడ్డు వచ్చిన గోడౌన్ కూలీని గాయపరచి, గల్లాలోని 6,30,00 రూపాయలు దోచుకెళ్లాడు. మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఠాగూర్, పాండియన్లు పిచ్చాటూరు నుండి చెన్నైకి వెళుతున్న సమాచారం పోలీసులు తెలుసుకొని పుత్తూరు సిఐ, ఇన్స్పెక్టర్ వారిని వెంబడించి అదుపులోకి తీసుకొని విచారించగా వారు చేసిన దోపిడీ అంగీకరించారు. నిందితుల వద్ద ఉన్న రెండు లక్షల రూపాయలు, నేరానికి వాడిన రాయల్ ఎన్ఫీల్డ్ వాహనం స్వాధీనం చేసుకొని, రిమాండ్ నిమిత్తం అరెస్టు చేశారు.

విద్యహక్కుచట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం, 2025 సెక్షన్ 12(1) ప్రకారం ఒకటవ తరగతిలో చేర్చుకొనుటకు పేద విద్యార్థులకు 25% అడ్మిషన్లు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో అన్ని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించా లని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్ రవి ఒక ప్రకటనలో కోరారు. తిరుపతి జిల్లా లో ఉన్న చాలా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్య హక్కు చట్టాన్ని లెక్క చేయకుండా విచ్చలవిడిగా విద్యను వ్యాపారం చేస్తున్నారని అటువంటి పాఠశా లలను గుర్తించి, గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కంచి పీఠం స్వాములకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: కంచి పీఠం స్వాములకు పుత్తూరులో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా స్వాగతం పలి కారు. ఇటీవల కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారిగా పట్టాభిషిక్తులైన శ్రీ సత్య చంద్ర శేఖరేంద్ర సరస్వతి శ్రీవారి దర్శనార్థమై తిరుపతికి విచ్చేశారు. వారిని గాయత్రి బ్రాహ్మణ సంఘం వారు ఘనంగా సత్కరించారు.

PASSPORT MISSING

I, Eraparaju Kiran Kumar S/o. Venkateswara Raju D.No. 2/40, Chinnampalli Village & Post, Obulavaripalli Mandal, Annamayya Dist., AP, India. I have lost my original Passport No.Z6705075 while shifting my house from Rajampeta to Chinnampalli on 25/04/2025. Anybody found please inform. Cell: 6301986354